# అమ్మ కావాలి

అమ్మంటె నాకెంతో ఇష్టం. నేను అల్లరి చేసినప్పుడు నన్ను ఎంతో బుజ్జగించి, నేనడిగినవన్నీ ఇచ్చి అమ్మ తన అక్కున చేర్చుకునేది. అమ్మ గురించి చెప్పటానికి నా చిన్న నోటికి మాటలు రావటం లేదు.

అమ్మ చాన్నాళ్ళ నుండి నాక్కనిపించటం లేదు. అప్పటినుండే నాన్నకూడా కనిపించడం లేదు.

నిన్ననే నాకు తెలిసింది అమ్మ చచ్చిపోయిందని. తాతయ్యనడిగా "అమ్మ చచ్చిపోయిందట. అంటే ఎక్కడికి వెళ్ళింది?" అని.

"మీ అమ్మ దేముడు దగ్గరి కెళ్ళింది. మీ అమ్మలా చక్కగా చదువుకో. అప్పుడు అమ్మ వస్తుంది. నీకెన్నో బహుమతులు ఇస్తుంది" అని చెప్పాడు తాతయ్య.

అప్పటి నుండి అమ్మను తలచుకుంటూ చక్కగా చదువుకుంటున్నాను.

నిన్ననే నాకు మరో కొత్త విషయం తెలిసింది. తాతయ్య ఎవరితోనో చెప్తుంటే విన్నాను.

అమ్మ సహజంగా చచ్చిపోలేదట. నాన్నే అమ్మను చంపేశాడట. ఎందుకో? నాకాశ్చర్యమేసింది.

అమ్మను నాన్న ఎందుకు చంపాడు? ఎలా చంపి వుంటాడు? కత్తితోనా?

పొంచివుండి ఇంకా వింటున్నాను. తాతయ్య కథలా చెప్తున్నాడు.

ఒకనాడు నాన్న తాతయ్య దగ్గరకు వచ్చి-

"మీ లక్ష్మిని నేను ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటాను. కట్నం ప్రసక్తిలేదు" అని అన్నాడట.

తాతయ్య అమ్మ అభిప్రాయమడిగితే అమ్మ "అతను డబ్బు మనిషని విన్నాను. తరువాత మీ ఇష్టం" అని అన్నదట.

అమ్మ మాటలు తాతయ్య నమ్మలేదట.

నాన్న మరీ బలవంతం చెయ్యగా తాతయ్య నాన్నకు అమ్మను ఇచ్చి పెళ్ళి చేశాడుట.

అమ్మ నాన్న ఇద్దరూ డాక్టర్లే. ఒకే చోట ప్రాక్టీసు పెట్టేరట. అమ్మ పేదవాళ్ళను పీడించేది కాదట. అంచేత సరియైన రాబడి లేదనీ, కట్నం కూడా తేలేదని అమ్మను నాన్న వేధించేవాడట.

కొన్నాళ్ళకు నేను పుట్టానట ఆడపిల్లను.

అప్పుడు నాన్న నిజస్వరూపం బయట పడిందిట. ఎంతో నెమ్మదిగ కనిపించే నాన్న అమ్మను ఇంకా చిత్రవధ చేసేవాడట. అమ్మ తాతయ్యతో ఒకనాడు చెప్పి ఏడ్చిందిట.

ఇంకొన్నాళ్లకు అమ్మకు మళ్ళీ నెల తప్పిందట. ఉన్న ఒక్క పాప చాలు. మరో బిడ్డ అప్పుడే వద్దని ఎబార్షన్ చేస్తానన్నాడట. అమ్మ 'సరే' నన్నదట. ఆ మరునాడే అమ్మ చచ్చిపోయిందట.

అమ్మను నాన్నే చంపి వుంటాడని తాతయ్యకు అనుమానం కలిగి నాన్న మీద కేసు పెట్టేడట. అమ్మను నాన్నే చంపినట్లు రుజువయిందట దర్యాప్తులో. కాని అమ్మ రాదుగా.

అమ్మను చంపితే నాన్నకు లాభమేమిటి? మరో పెళ్ళి చేసికొనవచ్చునా? లేక అమ్మ దగ్గర వున్న డబ్బు నగలు తనకు దక్కుతుందనా?

అమ్మలాంటి అమ్మలను చంపిన నాన్నలాంటి నాన్నలను మీరెప్పుడైనా ఎక్కడైనా చూశారా?

అమ్మ లేకుండా నేనెలా బ్రతకను? నాకు డబ్బు నగలు ఏమీ వద్దు. నాకు "అమ్మ" కావాలి. అమ్మను ఎవరు ఇస్తారు?

*

—కె.వి.గజపతిరావు

నిర్మల వక్కపొడి

ఆగష్టు 15వ తేదీ నుండి మా నిర్మల 0.10 పైసల వక్కపొడి 3 డజన్లు గానీ, 0.25 పైసల వక్కపొడి 3 డజన్లు గానీ, డీలక్స్ గోల్డ్ కవరు ప్యాకు 1 KG. గానీ, కొన్నవారు ఒక పెద్ద స్టెయిన్ లెస్ స్టీల్ గ్లాసు (బాంబే మోడల్) అడిగి తీసుకొన వలయును.

PRIYADS

నిర్మల వక్కపొడి మ్యానుఫ్యాక్చరింగ్ కంపెని
ట్రంకురోడ్, నెల్లూరు-524001.
ఫోన్స్: ఆఫీసు:3795- ఇల్లు:3796-షాప్:4796

